సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం ; 9 ; జూన్ ; 2024



వేటకు వేళాయె

సముద్రంలో వేట నిషేధం గడువు ముగుస్తోంది. ఐదు రోజుల్లో మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది.

8లో ▸



చెస్ టోర్నీలకు క్రేజ్

చదరంగంపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వస్తున్నారు.

8లో ▸



భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల చిన వెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

8లో ▸

అమాత్యయోగం.. ఎవరికి దక్కేనో!

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికార పార్టీలో అమాత్యుల రేస్ ప్రారంభమైంది. సీనియార్టీ, సామాజిక సమీకరణాల ప్రాతిపదికన గెలుపొందిన అభ్యర్థులు సీరియస్ ప్రయత్నాలకు తెరతీశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సగానికిపైగా కొత్త ముఖాలు కావడంతో సీనియర్ నేతలు బలమైన ఆశల్లో ఉన్నారు. 2014 తర్వాత జిల్లాలో టీడీపీ ఈ స్థాయిలో స్థానాలు గెలవడం, మరోవైపు జనసేన కూడా అన్ని స్థానాల్లో గెలవడంతో అమాత్య రేసు పోటీ గట్టిగా ఉంది. అయితే సీనియార్టీ ప్రాతిపదికన ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), పితాని సత్యనారాయణ (ఆచంట)కి అవకాశం దక్కుతుందనే ప్రచారం బలంగా ఉంది. ఇక లాబీయింగ్ కోటాలో కనుమూరి రఘురామకృష్ణరాజు (ఉండి)కు బెర్త్ కన్ఫార్మ్ అయిందనే ప్రచారం జోరుగా ఉంది. ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం జరుగనున్న క్రమంలో మరో రెండు రోజుల్లో మంత్రివర్గ కూర్పుపై మరింత స్పష్టత రానుంది.

ఆశల పల్లకిలో..
- ఉమ్మడి జిల్లా టీడీపీలో గట్టి పోటీ
- సామాజికవర్గ, సీనియార్టీ ప్రాతిపదికన కీలక సమీకరణాలు
- ఏలూరు జిల్లాలో చింతమనేని, కామినేనిలో ఒకరికి చాన్స్
- పశ్చిమ నుంచి రేసులో పితాని, నిమ్మల, రఘురామకృష్ణరాజు
- సీరియస్ ప్రయత్నాల్లో సీనియర్ నేతలు





పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, కనుమూరి రఘు రామకృష్ణరాజు, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్

విలక్షణ రాజకీయాలు

పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాలు ఎప్పుడూ విలక్షణంగానే ఉంటాయి. ఒకే రాజకీయ పార్టీకి సంపూర్ణ మద్దతు ఈ జిల్లాలో ప్రతి పర్యాయం దక్కుతూనే ఉంది. 2004, 2009లో అప్పటి కాంగ్రెస్‌కు, 2014లో తెలుగుదేశం పార్టీకి, 2019లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పూర్తిస్థాయిలో పట్టంకట్టారు. మళ్లీ తాజాగా 2024లో కూటమి అభ్యర్థులకు జిల్లా ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం అన్ని సీట్లలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నుంచి కూడా మంత్రి పదవుల్లో తీవ్ర పోటీ మొదలైంది. ఈ క్రమంలో సీనియార్టీ ప్రాతిపదికగా పార్టీలో మొదటి నుంచి ఉన్న నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. సీనియర్ నేతలకు సామాజిక సమీకరణాలు కూడా కలిసి రావడం జిల్లాలో ప్రధానాంశం.

పితానికి కలిసొచ్చే అంశాలు

శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ మంత్రిగా, చంద్రబాబు కేబినెట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆరోగ్య మంత్రిగా పనిచేశారు. బీసీల్లో బలమైన నేత కావడం, పోటీ కూడా అసలు లేకపోవడం బాగా కలిసొచ్చే అంశం. అలాగే చంద్రబాబు, లోకేష్‌తో సన్నిహిత పరిచయాల నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి ఖరారైందని బలంగా ప్రచారం సాగుతోంది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిమ్మల

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరున్న నిమ్మల రామానాయుడు కూడా మంత్రి పదవి రేసులో ముందు వరుసలో ఉన్నారు. సామాజిక సమీకరణాలు కూడా కలిసొచ్చే అంశం. ఉమ్మడి పశ్చిమలో సీనియర్ కాపు ఎమ్మెల్యే కావడం, 2014, 2019, 2024లో వరుసగా మూడుసార్లు గెలుపొందడం, పార్టీ కార్యక్రమాలను నూరుశాతం నిర్వహించి పార్టీలో మంచి టాక్ రికార్డు నిమ్మలకు కలిసొచ్చే అంశం. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాపుల్లో పోటీ కూడా లేకపోవడంతో నిమ్మలకు అవకాశం కచ్చితంగా ఇస్తారని పార్టీలో జోరుగా ప్రచారం సాగుతుంది.

సామాజిక లాబీయింగ్‌తో..

ప్రత్యేక పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీలో చేరి ఉండి నియోజకవర్గం నుంచి గెలుపొందిన కనుమూరి రఘురామకృష్ణరాజుకు కూడా అమాత్యయోగం దక్కుతుందని సమాచారం. ఆయన వర్గీయులు స్పీకర్ స్థానంపై ఆశలు పెంచుకున్నా.. మంత్రి పదవి అవకాశం దక్కుతుందని పార్టీలో ప్రచారం. సామాజిక లాబీయింగ్, చంద్రబాబుతో వ్యక్తిగత పరిచయాలు కలిసొచ్చే అంశంగా ఉన్నాయి.

ఫైర్ బ్రాండ్‌గా చింతమనేని : వివాదాస్పద ఎమ్మెల్యేగా పేరున్న చింతమనేని ప్రభాకర్ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే. 2009, 2014, 2024 ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. ఈ క్రమంలో చింతమనేనికి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రాతిపదికన చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతుంది. ఫైర్ బ్రాండ్‌గా పార్టీలో పేరు, సామాజికంగా మంచి బలం ఉండటం, లోకేష్‌తో సన్నిహిత సంబంధాల నేపథ్యంలో అమాత్యయోగం వరించవచ్చని అంటున్నారు.

మళ్లీ ఒక్క చాన్స్..

కైకలూరు నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన కామినేని శ్రీనివాస్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. బీజేపీ పెద్దల ఆశీస్సులు, మాజీ ఉప రాష్ట్రమంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో మళ్లీ మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. 2014లో కూటమి నుంచి పోటీ చేసి గెలుపొంది వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఆయన చేశారు. మరలా 2024లో గెలుపొందడంతో తనకున్న విస్తృత పరిచయాలు, సామాజిక లాబీయింగ్‌తో రేసులోకి వచ్చారు.

జనసేనలో ఒక్కరే సీనియర్

జనసేన పార్టీ నుంచి గెలిచిన వారిలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాత్రమే సీనియర్. మిగిలిన వారంతా మొదటిసారి గెలిచిన వారే. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి జనసేన ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పశ్చిమగోదావరి జిల్లాకు అవకాశం ఉండదేమోననే చర్చ సాగుతుంది. మరో మూడు రోజుల్లో అధికారిక ప్రకటనతో ఆశావహుల ప్రయత్నాలకు తెరపడనుంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్ ఆవరణలో విగ్రహాల తొలగింపు సరికాదు



మాట్లాడుతున్న భీమారావు

భీమవరం: పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీల విగ్రహాల తొలగించడం బీజేపీ నిరంకుశ, స్వార్థపూరిత, మతతత్వ, కుటిల రాజకీయాలకు పరాకాష్టగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అభివర్ణించారు. శనివారం భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో విగ్రహాల తొలగింపును నిరసిస్తూ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ముస్లిం మైనార్టీ నాయకుడు చాన్ భాషా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిరుమాని కామేశ్వరరావు మాట్లాడుతూ దేశ ఔన్నత్యానికి, ప్రతిష్టకు, మతసామరస్యానికి, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతిరూపాలుగా నిలిచిన మహనీయుల విగ్రహాల తొలగింపు బీజేపీ మతోన్మాద పాలనకు అద్దం పడుతుందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామిక వాదులంతా ఈ చర్యలను ఖండించాలన్నారు. బీజేపీ విభజన రాజకీయాలు, మతతత్వ విధానాలు వీడకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాలను యథాస్థానంలో ఉంచాలని డిమాండ్ చేశారు.

ముగిసిన 'ఓపెన్' పరీక్షలు

భీమవరం: జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం నిర్వహించిన పరీక్షలకు 90.32 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. టెన్త్ పరీక్షకు 210 మంది విద్యార్థులకు 194 మంది హాజరుకాగా, ఇంటర్ పరీక్షకు 713 మందికి 644 మంది హాజరయ్యారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రాష్ట్ర పరిశీలకులు 11 కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

ఏలూరులో 867 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 867 మంది హాజరయ్యారు. పదో తరగతి సోషల్ పరీక్షకు 286 మందికి 226 మంది, ఇంటర్ ఆర్థిక శాస్త్రం పరీక్షకు 325 మందికి 295 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్ రసాయన శాస్త్రం పరీక్షకు 397 మందికి 346 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయన్నారు.

నిట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్)లో 8 కోర్సులకు గాను 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 480 సీట్లు ఉండగా ఇందులో 50 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులతో, మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతో జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారని శనివారం నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10 నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఐదు జోసా, రెండు ప్రత్యేక రౌండ్ల ద్వారా ముగియనుందన్నారు. ఏపీ నిట్‌లోని మొత్తం 480 సీట్లకు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు ఏపీ నిట్ ప్రాంగణానికి వచ్చి తమ ఒరిజనల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రాంగణంలో ప్రత్యేక కేంద్రాన్ని సిద్ధం చేశామని తెలిపారు.

ఊటసముద్రంలో ఉద్రిక్తత

–వైఎస్ జగన్‌ని కించపరుస్తూ ఫ్లెక్సీలు
–కూటమి, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య ఘర్షణ

చింతలపూడి : ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఊటసముద్రం గ్రామంలో టీడీపీ, జన సేన కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరుస్తూ ఫ్లెక్సీలు పెట్టడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం రాత్రి ఫ్లెక్సీలను తొలగించమని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు అధికార పార్టీ కార్యకర్తలకు అండగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి భరత్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి అధికంగా ఓట్లు పడటంతో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన గ్రామస్తులను అసభ్యకరంగా తిట్టారని చెప్పారు. గ్రామంలో తాము ఎంతో సంయమనంతో ఉన్నామని, అయినా రెచ్చగొట్టి దాడులకు పూనుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘటనా స్థలానికి వచ్చిన సీఐ సుధాకర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు.

● జగన్‌ను కలిసిన గోపి



తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లులో పార్టీ విజయానికి తన శక్తి మేరకు కృషి చేశానని జగన్‌కు వివరించినట్టు గోపి ఇక్కడ విలేకరులకు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పనిచేస్తానని చెప్పానన్నారు.

– పాలకొల్లు అర్బన్

గ్రామాల్లో టీడీపీ వరుస దాడులు

పెదవేగి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ టీడీపీ శ్రేణులు చేస్తున్న దాడులు అడ్డూఅదుపు లేకుండా పోయాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. శనివారం ఆయన కొండలరావుపాలెం కార్యాలయంలో మాట్లాడుతూ రాజకీయాల్లో ఎవరైనా గెలవచ్చు, ఓడిపోవచ్చు అది ప్రజాతీర్పుపై ఆధారపడి ఉంటుందన్నారు. గెలిచిన పార్టీల వారు ఓడిన పార్టీల వారిని టార్గెట్ చేస్తూ కక్షపూరిత రాజకీయాలు చేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు వరుస దాడులకు పాల్పడటం సరికాదన్నారు. శనివారం రాత్రి ముండూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మునికుమార్, పెదవేగికి చెందిన చల్లగొళ్ల ప్రదీప్‌ల ఇళ్లపై టీడీపీ శ్రేణులు దాడులు చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు.



జగన్, అబ్బయ్యచౌదరి చిత్రపటాలను కిందపడేసిన దృశ్యం



ముండూరులో మునికుమార్ ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేసి..



పెదవేగిలో ప్రదీప్ కారు అద్దాలు పగులగొట్టి..

ఇంట్లో సామాన్లు, వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు మహిళలు, పిల్లలను భయభ్రాంతులకు గురిచేసి చంపేస్తామని బెదిరించారని కొఠారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొప్పాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పులుసు శివకుమార్ ఇంటిపై దాడి చేసి సామగ్రిని ధ్వంసం చేసి సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఫొటోలను కిందపడేశారన్నారు. దాడులపై పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలవాలని కొఠారు డిమాండ్ చేశారు.

ఎన్నికల నిర్వహణ స్ఫూర్తిదాయకం

కలెక్టర్‌కు అభినందనలు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చేసిన కృషి స్ఫూర్తిదాయకం, అభినందనీయమని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో పాటు రిటర్నింగ్ అధికారులు అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శనివారం జేసీతో కలిసి కలెక్టర్‌ను కలిసి సత్కరించారు. కలెక్టర్‌కు జేసీ లావణ్యవేణి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగడానికి చిత్తశుద్ధితో పని చేసి వృత్తి ధర్మాన్ని పారదర్శకంగా పాటించిన కలెక్టర్ అభినందనీయులన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారన్నారు. దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషిచేశారన్నారు. రిటర్నింగ్ అధికారులు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ఆర్డీఓలు ఎన్ఎస్‌కే ఖాజావలి, వై.భవానీ శంకరీ, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, ఎం.ముక్కంటి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో ఎన్నికల అధికారుల కృషి, సహకారం అద్వితీయమన్నారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, పోలీసులు, కేంద్ర బలగాలు, మాజీ సైనికులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అభినందనలు తెలుపుతున్న జేసీ, రిటర్నింగ్ అధికారులు

సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా



పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా పనిచేసిన కాలంలో కవులకు ప్రోత్సాహం, సాహిత్య అకాడమీ సంబరాల పేరుతో కవులను సత్కరించామన్నారు. రూ.10వేల బహుమతితో పది మందికి విశిష్ట సాహిత్య పురస్కారాలు అందజేత, రూ.5 వేల బహుమతితో 26 జిల్లాలకు చెందిన 26 మంది కవులకు ప్రోత్సాహక నగదు సత్కారం, 12 సాహిత్య సంస్థలకు ప్రోత్సాహక నగదు సత్కారం అందించామన్నారు. 125 మంది కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేసి సత్కరించామన్నారు. కలెక్టర్ అతిథిగా సంక్రాంతి సంబరాలు పేరుతో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే పలు సాహిత్య సంస్థలకు ప్రోత్సాహం అందించామన్నారు. ఏలూరులో ప్రతిభా పురస్కారాలు అందించామన్నారు. ఒంగోలు, అమలాపురం, విజయవాడ తదితర ప్రాంతాల్లో సాహిత్య అకాడమీ సౌజన్యంతో జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించామన్నారు. పలువురు రచయితలు, కవులను సత్కరించామన్నారు. తన రెండేళ్ల పదవీ కాలంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవిని ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు.

మీనం.. ఆరోగ్యం ఘనం



చేప మందుకు ఉపయోగిస్తున్న కొల్లేరు కొరమేను పిల్లలు



కొల్లేరు ప్రాంతంలో ఎండు చేపలు

- మృగశిర కార్తెలో చేప దివ్యౌషధం
- రోగ నిరోధక శక్తి పెంపునకు తోడ్పాటు
- ఔషధ గుణాలు అధికం
- గోదావరి, కొల్లేరు చేపల రుచే వేరు

ఆకివీడు: సంపూర్ణ ఆరోగ్యానికి చేపలు ఎంతో మేలు చేస్తాయి. మాంసాహారంలో చేపలు అంటే స్పెషల్. చేపలు తీసుకుంటే ఎన్నో రకాల పోషకాలు అందుతాయి. ప్రస్తుతం ప్రారంభమైన మృగశిర కార్తెలో మీనమేషాలు లెక్కించకుండా చేపలు ఆహారంగా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోహిణి, కృత్తిక కార్తెల్లో ఎండల్లో అల్లాడిపోయిన వారికి మృగశిర కార్తె పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. విపరీతమైన ఎండల నుంచి చల్లని వాతావరణంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా శరీరంలో వేడి తగ్గకుండా ఉండేందుకు చాలామంది వేడి చేసే పదార్థాలు చేపలు, మాంసాన్ని మృగశిర కార్తె ఆరంభం రోజున తింటారు. దీంతో మృగశిర కార్తెతో చేపలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ రోజున చేపలు తినాలనే సెంటిమెంట్ కూడా ఉంది. చేపల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. వీటిలో ఉండే పలు ప్రొటీన్లు, విటమిన్లు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. చేపల్లో ప్రొటీన్లు, ఒమేగా–3, విటమిన్–డి పుష్కలంగా ఉంటాయి. కంటిచూపు పెంచడంతోపాటు గుండె జబ్బులను నివారిస్తుంది. కలుషిత నీటిలో పెరిగిన చేపలు ఆరోగ్యానికి హాని చేస్తాయి. నదులు, మంచినీటి చెరువుల్లో పెరిగే చేపలను మాత్రమే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరాలు, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడే వారు మృగశిర కార్తెలో చేపల్ని తినడం ఉత్తమమని శాస్త్రీయంగా కూడా నిరూపితమైంది. హైదరాబాద్‌లో బత్తిన సోదరులు మృగశిర కార్తె ప్రారంభంలోనే చేప మందుతో లక్షల మందికి శ్వాసకోస, ఆస్తమా వ్యాధులకు మందులిస్తున్నారు.

గుండె నిబ్బరానికీ చేపే మందు

గుండె నిబ్బరానికీ, చలాకీగా పనిచేయడానికి చేప మాంసం దోహదపడుతుంది. చేపల్లో ఔషధ గుణాలు అపారంగా ఉన్నాయి. ఏ అండ్ డీ విటమిన్లు ఉన్నాయి. ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, మెదడు నరాలు చురుగ్గా పనిచేయడానికి, కణాల క్షీణతను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. కంటి లోపాలకు అడ్డకట్ట వేస్తుంది. అంధత్వం తగ్గుతుంది. బాలింతలకు మెత్తళ్ల కూర పత్యంగా అందిస్తారు. ఆక్సిజన్ అందని సమయాల్లో కొరమేను వంటి నల్ల చేపల్ని తినడం ద్వారా శక్తి వస్తుందనే అధ్యయనాలు ఉన్నాయి. చేపల్లో ఫాస్పరస్ వంటి ఖనిజాలున్నాయి. అల్జీమర్స్ వ్యాధిని రాకుండా చేస్తాయి.

ఎయిర్ బ్లాడరూ ఉపయోగమే.. చేప భౌతికంగా కూడా పలు విధాలుగా ఉపయోగపడుతుంది. చేప నుంచి తయారు చేసిన నూనెలో విటమిన్ ఏ అండ్ డీ ఉంటాయి. చేపలోని ఎయిర్ బ్లాడర్ (బుడగ) వంటి భాగాన్ని శాస్త్రవేత్తలు పలురకాలుగా ఉపయోగిస్తారు. స్టంట్, మందుల తయారీలో వీటిని ఉపయోగిస్తున్నట్టు ఫిషరీస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చేపలు.. మానవ నేస్తాలు



చేపలు మానవ నేస్తాలు. వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవించవచ్చు. నల్ల చేపలు తినడం వల్ల ఆక్సిజన్ అందని సమయాల్లో తట్టుకునే శక్తినిస్తాయి. చేప మాంసం గుండె కండరాలకు బలాన్నిస్తాయి, చర్మవ్యాధుల్ని అంతమొందిస్తాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. చేపల్లో ఒమెగా–3 ఉంటుంది. ఫాస్పరస్, ఏ అండ్ డీ విటమిన్లు ఉంటాయి. యవ్వనంగా ఉండటానికి, నరాల శక్తికి దోహదపడతాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం ఆరోగ్యానికి మేలు.

– డాక్టర్ కనిశెట్టి ప్రసాద్, జీవ శాస్త్ర సీనియర్ ఉపాధ్యాయుడు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

కొల్లేరు కొరమేను.. గోదారి పులస

కొల్లేరు సరస్సులో సహజ సిద్ధంగా పెరుగుతున్న కొరమేను చేప రుచిలో, ప్రొటీన్లలో మిన్న. ఒకప్పుడు నోరూరించే బొమ్మిడాయి పులుసు కూడా కొల్లేరు సొంతమే. గోదారంటే పులస చేపతోపాటు పలు రకాల చేపలతో వంటలు గుర్తుకు వస్తాయి. కొరమేను కూర, బొమ్మిడాయి పులుసు, కట్టుచేపల ఇగురు, చందువా వేపుడు, పండుగొప్ప ఇగురు, శీలావతి, బొచ్చు, బంగారుతీగ, మట్టగిడస, ఇంగిలాయి, మార్పు, నాటు గురక వంటి పలు రకాల వంటకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అంటున్నారు.

చింత చిగురు.. నోరూరు..

మృగశిర కార్తెలో చిగురించే చింత చిగురు, కాసే మామిడి కాయలతో పలు రకాల చేపల్ని కలిపి వండటం గోదావరి జిల్లాల్లో ప్రత్యేకం. చింత చిగురులో పచ్చి మెత్తళ్లు, పిత్తపరిగెలు వంటి వాటితో వంటకాలు భోజనప్రియులను నోరూరిస్తుంటాయి. ముఖ్యంగా గోదావరి, కొల్లేరు సరస్సు ప్రాంతాల్లోని చేపలకు ఇతర రాష్ట్రాలో మంచి గిరాకీ ఉంది. హైదరాబాద్, తిరుపతి, విశాఖ, ఖమ్మం, వరంగల్, కర్నాటక, చెన్నై వంటి ప్రాంతాల్లో ఈ ప్రాంత రుచులతో రెస్టారెంట్లు, హోటళ్లు కూడా ఉన్నాయి.

క్లుప్తంగా

పాలకమండలి సభ్యుల రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఈవోకు అందిస్తున్న ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు రాజీనామా చేశారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణకు పాలకమండలి చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్టీ సభ్యులు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కోరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సహకారంతో స్వామివారికి సేవ చేసుకునే అవకాశం దక్కిందన్నారు. ఆలయాన్ని ప్రభుత్వం, దాతల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు, ప్రభుత్వ అధికారులకు, ట్రస్టీ సభ్యులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ముంగండ అన్నవరం, టీవీయుఆర్ శర్మ, కాండ్రేగుల రాజేశ్వరి, తరపట్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, శ్రీ మన్యం జగ్గమ్మగారి సత్రం చైర్మన్ నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు కూడా రాజీనామా చేశారు.

బలుసుమూడిలో చోరీ

భీమవరం: భీమవరం టూటౌన్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో దొంగలు బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారని టూటౌన్ సీఐ జె.శ్రీనివాస్ చెప్పారు. బలుసుమూడిలోని సున్నం ఆంజనేయులు అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న పాపరపల్లి మాలతి ఈనెల 1న తన కుమారుడిని ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించడానికి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఈ నెల 6న ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి బీరువాలోని 144 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ వివరించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మొగల్తూరు : కూలి పనికి వెళ్ళిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై కె.వెంకటరమణ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు వెలిదివారి వీధికి చెందిన వెలిది పాపయ్య (47) ఈనెల 6వ తేదీన కూలి నిమిత్తం మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపురం వెళ్ళాడు. కూలి పనులకు వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. శనివారం ఉదయం సీతారాంపురంలోని మురుగు కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉండటంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పాపయ్యదిగా గుర్తించారు.

వేటకు వేళాయె

- మరో 5 రోజుల్లో ముగియనున్న వేట నిషేధం
- వేట సామాగ్రి సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

నరసాపురం: సముద్రంలో వేట నిషేధం గడువు ముగుస్తోంది. మరో ఐదురోజుల్లో మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది. దీంతో జిల్లాలో నరసాపురం తీరప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులు వేటకు సమాయాత్తమవుతున్నారు. రెండు నెలలుగా వలలు మూలనపెట్టి ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు వేట సామగ్రి సిద్ధం చేసుకుంటున్నారు. వలలు, బోట్ల మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకూ ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ఈ 61 రోజులు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని అమలు చేసేది. వరుసగా ఐదేళ్లపాటు పథకం ద్వారా వేట సాగించే ఒక్కో మత్స్యకారుడికి రూ.10 వేల సాయం అందించేవారు. మే నెలలోనే పథకం సొమ్ము మత్స్యకారుల ఖాతాల్లో జమయ్యేది. ఈ ఏడాది ఎన్నికల కారణంగా మత్స్యకార భరోసా పథకం అమలు కాలేదు.

తీరంలో జోరుగా వేట

జిల్లాలో 19 కిలోమీటర్లు మేర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో ప్రతిరోజూ జోరుగా వేట సాగుతుంది. బంగాళాఖాతానికి కీలకమైన ప్రాంతంలో ఉండటం, గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడి తీరంలో మత్స్యసంపద అపారంగా దొరుకుతుంది. నెల్లూరు, విశాఖ, మచిలీపట్నం, విశాఖపట్నం తదితర జిల్లాలకు చెందిన సుమారు 150 బోట్లు ఇక్కడ నిత్యం సముద్రంలో వేటసాగిస్తాయి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగానే మత్స్య సంపద దొరుకుతుంది. దాదాపుగా 2 వేల మంది వరకూ పూర్తిగా వేటనే నమ్ముకుని ఇక్కడ బతుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లోనే మత్స్యకార భరోసా పథకాన్ని జగన్ అమలు చేశారు. ఐదేళ్లపాటు ఐదు దఫాలుగా రూ.10 వేల చొప్పున అందించారు.



వలల బాగుచేసుకుంటున్న మత్స్యకారులు



వేట సాగిస్తున్న మత్స్యకారులు (ఫైల్)

వేట కోసం ఎదురు చూస్తున్నాం



వేట సమయం ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నాం. ఇంకో రెండు వారాల్లో వేట ప్రారంభమవుతుంది. మాకు వేరే పని తెలియదు. ఈ రెండు నెలలు ఖాళీగానే ఉన్నాం. గత ప్రభుత్వంలో మాకు వేట నిషేధ సమయంలో ఐదేళ్ల పాటు మత్స్యకార భరోసా పథకంలో రూ.10 వేలు చొప్పున అందించారు.

– పెమ్మాడి నాగరాజు, మత్స్యకారుడు, నరసాపురం

చేపలు బాగా దొరుకుతాయి



రెండు నెలలు నుంచి సముద్రంలో వేటలేదు. ఇప్పుడు వేటకు వెళితే చేపల బాగా దొరుకుతాయి. చేపలు పైకి బాగా తేలి వలలకు చిక్కుతాయి. మాకు సముద్రంలో ఈ నెల సీజన్. తుఫాన్‌లు పట్టకూడదు. ఇప్పుడు వాతావరణం భయపెడుతుంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే వేటకు వెళతాం.

– మైలా ఏడుకొండలు, పీఎం లంక, మత్స్యకారుడు

సముద్ర తీరంలో వ్యర్థాల ఏరివేత



నెస్ట్స్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పాలకొల్లు సెంట్రల్ : ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా నెస్ట్స్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పేరుపాలెం సముద్ర తీరంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నెస్ట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మనీష్ గౌడ్ మాట్లాడుతూ తీరప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సముద్రంలోని జీవరాసులు మృత్యువాత పడుతున్నాయన్నారు. వాటిని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. తీర ప్రాంతంలో 300 కిలోల వ్యర్థాల్ని సేకరించినట్లు చెప్పారు.

వెదజల్లే పద్ధతిలో అధిక దిగుబడి



డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు నాటుతున్న రైతులు



వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్న వరిపంట

నూజివీడు: పెరుగుతున్న నీటివాడకం, తరుగుతున్న జలవనరుల దృష్ట్యా నీటి సమగ్ర వినియోగానికి ప్రాధాన్యం పెరిగింది. ముఖ్యంగా వరిసాగులో సంప్రదాయ పద్ధతైన నారుపోసి, నాట్లు వేసి సాగుచేసే పద్ధతి కాకుండా నేరుగా విత్తే పద్ధతి అనువైన మార్గమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ విధానానికి తక్కువ నీటి వినియోగం, కూలీల అవసరం తక్కువగా ఉంటుందని నూజివీడు ఏడీఏ జీ విద్యాసాగర్ తెలిపారు. ఈ పద్ధతిని ఆచరిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని, నీటి సమస్య ఉండదని పేర్కొంటున్నారు. వరినాట్లు ఆలస్యం అయిన ప్రాంతాలలో ఈ పద్ధతిని పాటించవచ్చు.

నేరుగా సాగుచేసే పద్ధతి

నేరుగా విత్తనాలను పొలమంతా సమానంగా చల్లడం గాని, వరుసల్లో విత్తడం గాని చేస్తారు. ఈ విధానంలో వరిపంటను పండించడం చాలా తేలిక. తక్కువ కాలంలోనే పంట చేతికి వస్తుంది. నేరుగా విత్తడం వల్ల పెట్టుబడి 40 శాతం వరకు తగ్గుతుంది. దున్ని, దమ్ము చేయాల్సిన పనిలేదు. నారుమడి తయారీకి, నారు పోయడానికి, పెంపకానికి అవసరమయ్యే నీటిని ఆదా చేయవచ్చు. పంటకాలం కూడా వారం నుంచి 15 రోజులు తగ్గుతుంది. దీని వల్ల రైతులు రెండు పంటలు సాగుచేసిన తరువాత మూడోపంటగా పప్పుధాన్యాలు వేసుకోవచ్చు. ఈ విధానంలో కూలీల అవసరం, పెట్టుబడి తక్కువ.

తీసుకోవాల్సిన మెళకువలు

విత్తనం వేయడానికి వారం రోజుల ముందు పొలాన్ని బాగా దున్ని దమ్ము చేసుకోవాలి. రెండు అంగుళాల నీటిమట్టం ఉంచి బాగా కలియదున్నాలి. హెక్టారుకు 50 నుంచి 100 కిలోల విత్తనాలు వాడవచ్చు. తొలుత విత్తనాన్ని శుభ్రపరిచి నీటిలో 24 గంటలు నానబెట్టి నీరు ఓడ్చి నేలపై కుప్పపోయాలి. ఆ తరువాత దానిపై గడ్డి వగైరా కప్పి 24 గంటల నుంచి 36 గంటల వరకు ఉంచాలి. లేదా గోనెసంచులను తడిపి వాటిలో విత్తనాలను నింపవచ్చు. ఒకటి లేక ఒకటిన్నర రోజులు తరువాత చూస్తే మొలకలు వస్తాయి. విత్తనాలను పొలంలో చల్లేముందు నేల స్వభావం, భూసారాన్ని బట్టి ఎరువులు వేసుకోవాలి. అనంతరం విత్తనాలను వరుసలలో వేసుకోవాలి. దీనివల్ల పంటకు నీరు పెట్టడం, కలుపుతీయడం సులువుగా ఉంటుంది. విత్తిన రెండు రోజుల తరువాత పొలంలో ఎక్కువగా ఉన్న నీటిని తీసేయాలి. అలా పదిరోజుల వరకు రెండు మూడు రోజులకొకసారి తడిపెట్టి ఆరకుండా చూసుకోవాలి. మొదటి నెలరోజుల వరకు అంటే మొక్క నాలుగైదు ఆకులు తొడిగే వరకు ఎలుకలు, పక్షులు బారి నుంచి కాపాడుకోవాలి. మొదటి నెల నీరు అంగుళం మించి ఉండకూడదు. ఆ తరువాత రెండు అంగుళాల వరకు పెట్టుకోవచ్చు. పిలకలు వేసే దశలో మొత్తంలో నాలుగోవంతు నత్రజని, చిరుపొట్ట దశలో ఇంకో నాలుగో వంతు నత్రజని, సగభాగం పొటాష్ వేసుకోవాలి. నెలరోజులు గడిచిన తరువాత మొక్కలు పలుచగా ఉన్నచోట, ఒత్తుగా ఉన్న చోట నుంచి మొక్కలను తెచ్చి నాటుకోవాలి. నేరుగా విత్తడం వల్ల కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి సరైన సమయంలో కలుపు తీయాలి. లేకపోతే వరికంటే కలుపు బాగా పెరిగి పంటకు నష్టం కలిగిస్తుంది.

భక్తజన సంద్రం.. చినవెంకన్న క్షేత్రం



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ బయట బారులు తీరిన భక్తులు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోను వేసవి సెలవులు ముగుస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. దేవస్థానం సిబ్బంది భక్తులకు క్యూలైన్లలో నిరంతరాయంగా మంచి నీటిని అందించారు. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. కొండపైన ఘాట్ రోడ్డులో భక్తుల వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. హోం గార్డులు ఎంతో శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.



భక్తులతో నిండిన అనివేటి మండపం



అనివేటి మండపంలో కోలాట నృత్యాలు

శ్రీశ్రీ కుమారుడి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): ప్రముఖ కవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) కుమారుడు శ్రీరంగం వెంకటరమణ మృతికి సానుభూతిని తెలియజేస్తున్నట్లు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 59 ఏళ్ల వయసులో అనారోగ్యంతో అమెరికాలో ఆయన మృతి చెందినట్లు తమకు తెలిసిందని చెప్పారు. వెంకటరమణ భార్య మాధవి గణపవరం నివాసి అని గుర్తుచేశారు. వెంకటరమణ 25 ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లి ఫైజర్ కంపెనీ పరిశోధనా విభాగంలో ఉద్యోగంలో చేరారు. వీరి మరణంతో సాహితీ లోకం దిగ్భ్రాంతికి గురైందన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



ఏలూరు (టూటౌన్): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఏలూరుకు చెందిన లక్కోజు రాజగోపాలాచారి(గోపి) శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, విజయవాడకు పంపినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ఓటమి చెందడంతో తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన చెప్పారు. తనకు పదవిని ఇవ్వడంలో సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీ కాలంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ బీసీ సంఘాల నాయకులు సహకరించినట్లు చెప్పారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన రాయవరపు వెంకట సూర్యనారాయణ శనివారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఆయన ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళం సొమ్మును ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చెస్ టోర్నీలకు క్రేజ్

- భీమవరంలో ఫిడే రేటింగ్ చెస్ పోటీలు
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన చిన్నారులు



భీమవరంలో ఫిడే రేటింగ్ చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం : క్రీడల పట్ల విద్యార్థుల్లో క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. దీంతో చెస్, బ్యాడ్మింటన్ వంటి గేమ్స్ నిర్వహణకు స్వచ్ఛందసంస్థలు, దాతలు ముందుకువస్తున్నారు. భీమవరం పట్టణంలో అనసూయ చెస్ అకాడమీ, యూత్ క్లబ్, కాస్మో క్లబ్, టౌన్‌హాల్, శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపం, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం వంటివి ఏటా అనేకరకాల క్రీడా పోటీలను నిర్వహించడంతోపాటు నిర్వహించే వారికి అండగా నిలుస్తున్నాయి. పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించడంతో పట్టణంలో వ్యాపార సంస్థలకు ఆదాయం కూడా సమకూరుతోంది.

చెస్ పోటీల పట్ల ఆసక్తి

పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈనెల 4 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ నెల 9 వరకు ఈ పోటీలు జరుగుతాయి. అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 272 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వారి వెంట దూరప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పట్టణంలో హోటల్స్, లాడ్జీల్లో ఉంటున్నారు. పోటీల్లో పాల్గొంటున్న 272 మంది క్రీడాకారుల్లో సుమారు 50 మంది మాత్రమే జిల్లా వాసులుకాగా మిగిలిన వారంత ఇతర ప్రాంతాలకు చెందినవారే కావడం విశేషం. భీమవరంలో గత నెలలోనే జాతీయ స్థాయి చెస్ పోటీలు నిర్వహించగా ఆగస్టులో మరో చెస్ పోటీ నిర్వహించనున్నారు.

చెస్ పట్ల ఆసక్తి



నాకు ఈ మధ్య చెస్ పట్ల ఆసక్తి పెరిగింది. పట్టణ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. చెస్ ఎంతో కష్టమని అనుకుంటారు. సాధన చేస్తే విజయాన్ని అందుకోవడం కష్టంకాదు.

మాదాసు సత్యనారాయణ, భీమవరం

దాతల సహకారం మరువలేనిది



అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ పోటీలు భీమవరంలో నిర్వహిస్తున్నాం. ఈ పోటీల్లో అనేక ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. చెస్ పోటీల నిర్వహణకు దాతల సహకారం మరువలేనిది.

– మాదాసు కిషోర్, చెస్ కోచ్

నాన్న ప్రోత్సాహంతో..



మా నాన్న ఉపాధ్యాయుడు. ఆయనకు చెస్ అంటే బాగా ఇష్టం. ఆయన ప్రోత్సాహంతో చెస్‌లో శిక్షణ పొంది వైజాగ్, కోనసీమ జిల్లాల్లో వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు గెల్చుకున్నా. మరిన్ని విజయాలు సాధించాలనే లక్ష్యంతో పట్టుదలతో సాధన చేస్తున్నాను.

– టి.సాయి వెంకటేష్, అమలాపురం


అన్న, అక్క ప్రోత్సాహంతో రాణిస్తున్నా



చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఇష్టం. ఇంతవరకు వివిధ ప్రాంతాల్లో చెస్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో మూడు బహుమతులు గెల్చుకున్నా. మా అక్క, అన్న చెస్ క్రీడాకారులు. వారి ప్రోత్సహంతో చెస్‌లో మరింత రాణించి ఉమెన్ గ్రాండ్ మాస్టర్ కావడమే లక్ష్యం.

– వల్లూరి సుప్రిత, విజయవాడ

నాలుగేళ్లుగా చెస్ ఆడుతున్నా



నాలుగేళ్లుగా చందరంగం పోటీల్లో పాల్గొంటున్నా. యూనివర్సిటీ స్థాయిలో అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు గెల్చుకున్నా. చదరంగం ద్వారా మెదడుకు పదును పెట్టవచ్చు.

– సిహెచ్ కౌశిక్, అనంతపురం

క్లుప్తంగా

వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం


ఆలయానికి విరాళం అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ద్వారకానగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం దాతలు రూ. 50,116 అందజేశారు. టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, పాతూరు వాస్తవ్యులు యడ్లపల్లి కాశీ విశ్వేశ్వరరావు, సుమతి దంపతులు, కుమార్తె మాధవి ప్రియ, కుమారుడు రఘువర్ధన్, కుటుంబ సభ్యులచే విరాళాన్ని ఆలయ ట్రస్టుకు అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


రక్తదానం చేస్తున్న దాతలు

తణుకు: రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఇండియన్ రెడ్‌క్రాస్, కారుమంచి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తణుకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 11 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అజయ్, విజయ్, రాంపండు, శశికిరణ్, హేమంత్, రాజు, అబ్దుల్లా, బాజీ, పండు, హరి, శ్రీనివాస్ రెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శేఖర్, చిన్నిబాబు, శామ్యూల్ పాల్గొన్నారు.

కాపులకొడప వెంకన్నకు మామిడి పండ్లతో అలంకరణ

నరసాపురం రూరల్: మేములదీవి గ్రామం కాపులకొడపలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామిని శనివారం మామిడి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి కెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠమాస జాతర మహోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసాదుల నృత్యాలు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాలు మొదటి రోజు వైభోగంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు, అర్చకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆకివీడు: స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో లయన్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆదర్శ క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు చెప్పారు. లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా ఎంవీఎస్ నాగమణి, సంయుక్త కార్యదర్శిగా ఎస్వీజీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, జితేంద్రబాబు, ఇతర కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర్ల శాంతి, సీహెచ్ కృష్ణంరాజు, గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు హాజరవుతారన్నారు. లయన్స్ ప్రతినిధులు పల్లి రంగారెడ్డి, నేరెళ్ల రామ చెంచయ్య, గొంట్లా కృష్ణ, షరీఫ్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా బీవీ రాజు వర్ధంతి

భీమవరం: పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరం పరిసర గ్రామాల్లో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని బీవీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని లెప్రసీ సెంటర్‌లోని లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు రూ.50 విలువైన మందులు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. అలాగే సెయింట్ మేరీస్ హాస్టల్ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు, 7వ వార్డు లెప్రసీకాలనీలో 112 మంది రోగులకు నిత్యావసరాలు అందజేశారు. బీవీ రాజు క్యాంపస్‌లో పనిచేసే కార్మికులకు పండ్లు, రొట్టెలు అందజేశారు.

ప్రాణాలు తీస్తున్న హైవే నిర్వహణ

- నిత్యం మరమ్మతుల పేరుతో ట్రాఫిక్ మళ్లింపు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి


జాతీయ రహదారిపై నిత్యం కనిపించే ట్రాఫిక్ కోన్స్

తణుకు: జాతీయ రహదారి నిర్వహణ పనులు ఎలా ఉన్నా నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంభిస్తున్న తీరుతో ప్రాణాలు కోల్పోతున్నాయి. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి అభివృద్ధి పనుల పేరుతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే గత కొన్నేళ్లుగా మరమ్మతుల పేరుతో నిత్యం ట్రాఫిక్ మళ్లిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా పలువురు వాహనదారులు మృత్యువాత పడుతుండగా పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులకు వినియోగిస్తున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తాజాగా తణుకు మండలం దువ్వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే నిర్వహణ వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని పదో తరగతి చదువుతున్న బాలిక దుర్మరణం పాలైంది. ఇలాగే గతంలో సైతం పలువురు మృత్యువాత పడ్డారు.

నిత్యం ట్రాఫిక్ మళ్లింపు...

పెనుగొండ మండలం సిద్ధాంతం నుంచి తాడేపల్లిగూడెం వరకు దాదాపు 50 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రెండేళ్ల క్రితం ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా ఈ రోడ్డులో నిత్యం మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. దీంతో రోడ్డుకు మధ్య భాగంలో ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కిలోమీటర్లు మేర వీటిని ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల దువ్వలో జరిగిన ప్రమాదంలో రోడ్డు డివైడర్‌లో మొక్కలకు నీళ్లు పోసే వాటర్‌ట్యాంకర్ వాహనం మోటారు సైకిల్ ను ఢీకొట్టడంతో బాలిక అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. గతంలో డీమార్ట్ సమీపంలో సైతం మోటారు సైకిల్‌పై వెళుతున్న మహిళ రోడ్డు డివైడర్‌పై పడి మృతి చెందారు. పెరవలి మండలానికి చెందిన మరో వ్యక్తిని హైవే నిర్వహణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద సిగ్నల్ వద్ద వేచి ఉన్న యువకుల మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఇటీవల అలంపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో గొయ్యిలో పడి ఒక యువకుడు మృతి చెందాడు.

నాసిరకం పనులతో...

జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో నిత్యం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు పగలు సమయాల్లో మాత్రమే మరమ్మతు పనులు చేపడుతూ రోడ్డు మళ్లింపు చేపట్టాల్సి ఉంది. అయితే జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది మాత్రం రాత్రి సమయాల్లో సైతం ట్రాఫిక్ కోన్స్ అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి మరమ్మతు పనులు చేయపోయినప్పటికీ రోడ్డు మార్గం మళ్లిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి ఆనుకుని గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన


పెదఅమిరంలో ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వర్మ

కాళ్ల: సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగిరాజు రామకృష్ణవిశాంత్ వర్మ అన్నారు. శనివారం పెద అమిరం పంచాయతీ గ్రామంలో తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించే ఫిల్టర్ బెడ్ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ కో ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఆర్‌కేఆర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టినట్లు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేసేందుకు దాతల సహకారంతో రూ.35 లక్షల విలువైన ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు ఫిల్టర్‌బెడ్ నిర్మాణంతో ప్రజల తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవ్వాది కిశోర్ స్థానికులు పాల్గొన్నారు.

ఆకుతీగపాడులో ఉపాధి కూలీల నిరసన


ఆకుతీగపాడులో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పెంటపాడు: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతనాలు పెంచుతూ రోజుకు రూ.300 చెల్లిస్తానన్న హామీ ఆచరణకు నోచుకోవడం లేదని, సత్వరం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఆకుతీగపాడు గ్రామంలో శనివారం ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోమరాజు, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతు ఉపాధి కూలీలకు రూ.250 నుంచి రూ.270 వరకూ మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాని కోరారు. క్షేత్ర స్థాయిలో పనులను అధికారులు సందర్శించి కూలీల బాధలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సీనియర్ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో కొండేటి లవణపింకీ, కొండేటి మేరీ గ్రేస్, పింకి చిన్నారావు, పాలమాటి బాబ్జి, కటిక దేవుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కోదండరాముడి కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న గుడాల సత్యనారాయణ దంపతులు


రాయికుదురు గుడాలవారి వీధిలో వేంచేసి యున్న శ్రీ సీతా సమేత శ్రీకోదండరాముడు

వీరవాసరం: రాయికుదురు గుడాల వారి వీధిలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం వార్షిక మహోత్సవం శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, శ్రీ స్వామివార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. గ్రామ పెద్ద గుడాల సత్యనారాయణ దంపతులతో అర్చకస్వామి నారాయణం శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో శ్రీసీతా సమేత శ్రీ కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో బూరి, పులిహోర, నవకాయ పిండివంటలతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

పాడి పశువులకు జోరుగా వ్యాక్సినేషన్


కనకాయలంకలో గేదెలకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ పోరెడ్డి చంద్రశేకర్‌రెడ్డి

యలమంచిలి: వేసవి అనంతరం వర్షాకాలం ప్రారంభ సమయంలో ఏర్పడే వాతావరణ మార్పు వల్ల పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల్లో గాలికుంటు ప్రాణాంతకమైనది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ సిబ్బంది గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ వ్యాధి సోకితే పశువు ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి ప్రభావం ఎక్కువైతే పశువు మరణించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పశువులకు ప్రాణాపాయం రాకుండా ముందస్తుగానే ఈ వ్యాక్సిన్ వేయించాలని పశువుల వైద్యులు కోరుతున్నారు.

ప్రణాళిక బద్ధంగా వ్యాక్సిన్

గాలికుంటు వ్యాధి నుంచి పశువులను రక్షించేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేయిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా మే 25న ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం పూట పశు వైద్యులు, గ్రామ పశు సహాయకులు, గోపాలమిత్ర పశువుల కొట్టాల వద్దకు వెళ్లి ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు పర్యవేక్షణలో పశు సిబ్బంది ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి పశువుకు ఈ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా గ్రామ పశు సహాయకులు రైతులకు సమాచారం ఇస్తున్నారు. ఆ సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాలకొల్లు డివిజన్‌లో..

పాలకొల్లు డివిజన్‌లోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో 4,908 ఆవులు, 14,033 గేదెలు కలిపి 18,941 పశువులు ఉన్నాయి. గత నెల 25 ప్రారంభించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంత వరకు 9,085 పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుంది. ఈ లోపు నూరు శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేస్తామని పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు చెప్పారు.

పౌష్టికాహారం అందజేత


భీమవరంలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

భీమవరం: హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులతో పాటు సరైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో దాతలు, స్వచ్ఛంద సంస్థలు పౌష్టికాహారాన్ని ప్రతినెలా అందిస్తున్నట్లు మానవతా సాంఘిక సేవా సంస్థ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు అన్నారు. శనివారం మానవతా సాంఘిక సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఆర్‌టీ సెంటర్ వైద్యుడు డాక్టర్ ఎం.గోవిందబాబు ప్రోత్సాహంతో పళ్ళ శేషలీల, రామం సహకారంతో పౌష్టికాహారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నరసింహమూర్తి (బాబు), అల్లు శ్రీనివాసులు, ఇందుకూరి ప్రసాదరాజు, చేకూరి జాన్సీ, ప్రభాకర్‌రావు, భవాని శీతల్, కముజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ


పేదలకు వస్త్రాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: ఉండి పడవలరేవులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి,కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేసేందుకు లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. క్లబ్ సభ్యుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబరాజు, క్లబ్ కోశాధికారి సాగిరాజు సూర్యకుమారి ఆర్థిక సహకారంతో మహిళలకు చీరలు, పురుషులకు ఫ్యాంటు షర్టులు అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే బొలిశెట్టికి అభినందనలు


ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మానవత సభ్యులు

పెంటపాడు: గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మానవత జిల్లా సంఘం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పెంటపాడుకు చెందిన ఉమ్మడి జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో సభ్యులు శనివారం బొలిశెట్టిని కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవలకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల మానవత సభ్యులు నక్కా సాంబశివరావు, సొసైటీ, జెడ్పీటీసీ మాజీ అధ్యక్షుడు దాసరి అప్పన్న, కిలపర్తి వెంకటరావు, పీబీ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన డీఎస్పీ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను డీఎస్పీ మూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. టౌన్ సీఐ ఏ.సుబ్రహ్మణ్యం, టౌన్ ఎస్ఐ జేబీఎన్ ప్రసాద్, రూరల్ సీఐ ఏ.రమేష్, ఎస్ఐ పి.సురేష్, పెంటపాడు ఎస్ఐ ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటు..ఆరోగ్యానికి చేటు

- మలేరియాపై పోరాటం వేగవంతం
- పరిశుభ్రతకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి...
- ప్రతి గడపను జల్లెడ పడుతున్న వైనం..


తణుకులో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


తణుకులో ఇంటి ఆవరణలో మొక్కల కుండీల్లో నీటి నిల్వలను చూపిస్తున్న అధికారులు

తణుకు అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమం పనిచేస్తుంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే పలు వ్యాధులను నిరోధించుకోవచ్చనే విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చనే విషయాన్ని తెలియపరిచే కరపత్రాలను సైతం పంచుతున్నారు. వేసవి ముగిసి వర్షాకాలం రావడంతో దోమల వ్యాప్తిని నిరోధించేందుకు వారానికోరోజు పరిసరాలను పరిశుభ్రంగా చేయాలనే ఉద్దేశ్యంతో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నారు.

దోమ పుట్టుకను నివారించాలి..

దోమ పుట్టుకను నివారిస్తే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారులు చెబుతున్నారు. దోమ కాటు ద్వారా మలేరియా డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పట్టణ, గ్రామాల్లోను అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించి వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త చెదారాలను తొలగింపజేయడంతో పాటు మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, రిఫ్రిజరేటర్లలో ఉన్న నీటి నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దోమల వ్యాప్తి నివారణలో భాగంగా కదలిక లేని నీటినిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయని ఆ లార్వా 8 నుంచి 10 రోజుల లోపు గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతరం చెందుతుందని ప్రజలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో వారానికోరోజు ఇంటి పరిసరాల్లో డ్రైడేగా పాటిస్తే దోమలను అరికట్టవచ్చనేది డ్రైడే, ఫ్రైడే ముఖ్య ఉద్దేశ్యంగా వివరిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రతతోపాటు అనవసర నీటినిల్వలపై జల్లెడ పడుతున్నారు. ఈ రకంగా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలు పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించగలుగుతున్నారు.

జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవం..

జూన్ నెల అంతా జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా పాటిస్తూ గ్రామాల్లోను, శివారు ప్రాంతాల్లోను ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలనే సూచనలు అందజేస్తున్నారు.

పరిశుభ్రత.. దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

- దోమ పుట్టనివ్వకూడదు, కుట్టనివ్వకూడదు.
- ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ పైపునకు మెష్ ఏర్పాటుచేయాలి.
- దోమ తెరల్లో నిద్రించాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- వాడుకలో లేని సామాగ్రిని బోర్లించి ఉంచాలి.
- వారానికోసారి ఇంటి పరిసరాల్లోని వాడకం కోసం ఉంచిన నీటి నిల్వలను మార్చుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉంటే వేస్ట్ ఆయిల్, కిరోసిన్ పోయాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూడాలి.
- ఇంటి ఆవరణలో దోమ వికర్షణాలై బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోజ్ మేరీ వంటి మొక్కలు పెంచుకోవాలి.